క్లుప్తంగా

రుషికొండలో సుందరకాండ షూటింగ్



లొకేషన్‌లో నటుడు నారా రోహిత్

కొమ్మాది: భీమిలి బీచ్ రోడ్డు రుషికొండలోని ఓ యూనివర్సిటీలో శుక్రవా రం షూటింగ్ సందడి నెలకొంది. సందీప్ పిక్చర్ ప్యాలస్ బ్యానర్‌పై నిమ్మలపూడి వెంకటేష్ దర్శకత్వం వహిస్తున్న సుందరకాండ సినిమాకు సంబంధించిన కొన్ని సన్నివేశాలను నటుడు నారా రోహిత్‌పై చిత్రీకరించారు. ఈ సినిమాలో హీరోయిన్‌గా శ్రీదేవి నటిస్తున్నారు. వారం రోజులుగా తీర ప్రాంతాల్లో జరుగుతున్న షూటింగ్ శుక్రవారంతో ముగిసినట్లు చిత్రం యూనిట్ తెలిపింది.

హెచ్‌ఐవీపై అవగాహన ర్యాలీ



మజ్జిపేటలో ర్యాలీ నిర్వహిస్తున్న ఆరోగ్య కార్యకర్తలు

తగరపువలస: హెచ్‌ఐవీపై ఆంధ్రప్రదేశ్ ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ, జిల్లా ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం అవగాహన కార్యక్రమం చేపట్టారు. భీమిలి మండలం మజ్జిపేటలో చైల్డ్ ఫండ్ ఇండియా లింక్ వర్కర్ స్కీమ్ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన మీకు తెలుసా కార్యక్రమంలో సీఎల్‌డబ్ల్యూ ఎం.జ్యోతి మాట్లాడారు. హెచ్‌ఐవీ, లైంగికంగా సంక్రమించే అంటువ్యాధుల గురించి సమాచారాన్ని అందించేందుకు రెండు నెలల పాటు ప్రత్యేక కార్యక్రమం నిర్వహిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో హెచ్‌ఎం ఎం ఉషారాణి, సీహెచ్‌వో రాజి, ఏఎన్‌ఎం బి.రమణమ్మ, అంగన్‌వాడీ కార్యకర్తలు దుర్గ, వరలక్ష్మి పాల్గొన్నారు.

సీఐఎఫ్‌టీతో గీతం ఎంవోయూ



అవగాహన ఒప్పందం కుదుర్చుకున్న ఇరుసంస్థల ప్రతినిధులు

కొమ్మాది: మత్స్యరంగంపై సంయుక్త పరిశోధనలను చేపట్టడానికి వీలుగా భారతీయ వ్యవసాయ పరిశోధనా మండలికి చెందిన సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫిషరీస్ టెక్నాలజీ (సీఐఎఫ్‌టీ)తో గీతం అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. గీతం రిజిస్ట్రార్ ప్రొఫెసర్ డి.గుణశేఖరన్ సమక్షంలో సీఐఎఫ్‌టీ డైరెక్టర్ డా.జార్జి నీనన్‌తో పరస్పరం ఒప్పందపత్రాలు మార్చుకున్నారు. ఈ సందర్భంగా డా. జార్జి నీనన్ మాట్లాడుతూ దేశంలో మత్స్యరంగంలో పరిశ్రమలకు, మత్స్యకారులకు పరిశోధకులకు, యువతకు ఉపయోగపడేలా కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు.

సోలార్ రూఫ్‌టాప్‌పై అవగాహన



బోని గ్రామంలో స్థానికులకు అవగాహన కల్పిస్తున్న ఈఈ శ్రీనివాసరావు

తగరపువలస: ఏపీఈపీడీసీఎల్ ఆధ్వర్యంలో ఆనందపురం మండలం బోని పంచాయతీలో ప్రజలకు సోలార్ రూఫ్‌టాప్‌పై శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈఈ పోలాకి శ్రీనివాసరావు మాట్లాడుతూ వినియోగదారులు సోలార్ రూఫ్‌టాప్ ఏర్పాటు చేసుకుంటే ఒక కిలోవాట్‌కు రూ.30వేలు, రెండు కిలోవాట్‌లకు రూ.60 వేలు, మూడు కిలోవాట్‌కు గరిష్ఠంగా రూ.78వేలు సబ్సిడీ ఇవ్వనున్నట్టు తెలిపారు. సోలార్ రూఫ్‌టాప్ ఏర్పాటుకు వినియోగదారుడు 10 శాతం చెల్లిస్తే సబ్సిడీ పోను మిగిలి మొత్తాన్ని 45 రోజుల్లోగా బ్యాంకుల నుంచి తక్కువ వడ్డీతో రుణం లభిస్తుందన్నారు. ఈ అవకాశాన్ని వినియోగదారులు వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో డీఈఈ టి.కిరణ్‌కుమార్, ఆనందపురం ఏఈఈ ఎ.సురేష్‌కుమార్ పాల్గొన్నారు.



అవంతి విద్యాసంస్థల్లో మట్టి వినాయక ప్రతిమలు పంపిణీ చేస్తున్న మాజీ మంత్రి ముత్తంశెట్టి



తగరపువలసలో మట్టి విగ్రహాలు పంపిణీ చేస్తున్న వాసవీక్లబ్ కార్యదర్శి శ్రీను



దివీస్ ఉద్యోగులకు విగ్రహాలు అందజేస్తున్న నిర్వాహకులు

మట్టి గణపతినే పూజిద్దాం



పాండ్రంగి హైస్కూల్లో విద్యార్థికి మట్టి విగ్రహాన్ని అందిస్తున్న నాయకులు



మట్టి వినాయక ప్రతిమలను అందిస్తున్న జడ్జి నాగేశ్వరరావు



శ్రీ వీరాంజనేయ స్వామి సేవా సంఘం ఆధ్వర్యంలో ..

- ప్రకృతి ప్రేమికుల గట్టి సంకల్పం
- వాడవాడలా వేలల్లో ప్రతిమల పంపిణీ

తగరపువలస: పర్యావరణ హిత గణేశుడిని పూజిద్దామంటూ నిపుణులు, ప్రకృతి ప్రేమికులు ఇచ్చిన పిలుపు మేరకు మట్టి గణపతినే పూజించేందుకు ప్రజలు సిద్ధమయ్యారు. అందుకనుగుణంగా సంస్థలు, పర్యావరణ హితులు మట్టి గణపతులను వాడవాడలా పంపిణీ చేశారు.

అవంతి విద్యాసంస్థల్లో..

చెరకుపల్లి అవంతి విద్యాసంస్థల్లో సిబ్బందికి మాజీ మంత్రి ముత్తంశెట్టి శ్రీనివాసరావు మట్టి గణపతి విగ్రహాలు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ భీమిలి నియోజకవర్గ ప్రజలకు విఘ్నాలు తొలగేలా గణనాథుడు ఆశీర్వదించాలని ఆకాంక్షించారు.

- స్థానిక వాసవీ క్లబ్ కార్యదర్శి ఆలవెల్లి శ్రీను స్థానిక మెయిన్‌రోడ్డులో శుక్రవారం 2వేల మట్టి గణపతి విగ్రహాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో భీమిలి ట్రాఫిక్ ఎస్ఐ చింతలపూడి చిరంజీవి రావు, ఆర్యవైశ్య సంఘం ప్రతినిధులు ఆదిమూలం నాగరాజు, ఉప్పల సాయిరామ్, పొట్టా ప్రకాశరావు, లక్ష్మణకుమార్, గ్రామీణ వైద్యుడు సీతారాం తదితరులు పాల్గొన్నారు.
- ఆనందపురం మండలం పెద్దిపాలెంలో బీజేపీ రాష్ట్ర నాయకుడు ఉప్పాడ అప్పారావు మట్టి గణపతి విగ్రహాలు పంపిణీ చేశారు.
- శొంఠ్యాం ఎన్ఎస్ఆర్ఐటీ యాజమాన్యం 1000 మట్టి విగ్రహాలను విద్యార్థులు, అధ్యాపకులతో పాటు చుట్టుపక్కల గ్రామాల్లోనూ పంపిణీ చేసింది. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఎస్.శంభుప్రసాద్, హరిగోపాల్, వ్యాయామ ఉపాధ్యాయులు పి.ఢిల్లీశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.
- భీమిలి మండలం చిప్పాడ దివీస్ లేబరేటరీ రూ.2.50 లక్షలతో 6వేల మట్టి విగ్రహాలను ఉద్యోగులు, కార్మికులు, చుట్టుపక్కల గ్రామాల్లో పంపిణీ చేసింది. కార్యక్రమంలో జాయింట్ చీఫ్ ఎన్విరాన్‌మెంట్ ఇంజినీరు రమేష్, సంస్థ జనరల్ మేనేజర్ వైఎస్ కోటేశ్వరరావు, డీజీఎం బాలాజీ, మేనేజర్ ఆర్.ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



రేవిడిలో శ్రీనివాస సేవా సంఘం అధ్యక్షుడు సన్యాసినాయుడు ఆధ్వర్యంలో..



శిల్పారామంలో మట్టి వినాయక ప్రతిమలు అందజేస్తున్న సీఐ కాంతారావు

పద్మనాభంలో 500 ప్రతిమలు..

పద్మనాభం: మండలంలోని రెండు గ్రామాల్లో శుక్రవారం ఐదు వందల మట్టి విగ్రహాలు పంపిణీ చేశారు. పాండ్రంగి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పీవీజీ చారిటబుల్ ట్రస్ట్ తరఫున రెండు వందల మట్టి విగ్రహాలను కొసర అప్పలనాయుడు, పోలిశెట్టి శ్రీనివాసరావు విద్యార్థులకు పంపిణీ చేశారు. హెచ్‌ఎం రాచకొండ వెంకటగిరి పాల్గొన్నారు.

- రేవిడిలో శ్రీనివాసరావు సేవా సంఘం ఆధ్వర్యంలో మూడు వందల మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేశారు. సేవా సంఘం అధ్యక్షుడు కోన సన్యాసినాయుడు, రిటైర్డ్ ఎంపీడీవో బాపిరాజు ఈ ప్రతిమలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మజ్జి శంకర్, పతివాడ ఇంద్రరావు, మరగడ చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.



శొంఠ్యాం ఎన్ఎస్ఆర్ఐటీలో అధ్యాపకులు, విద్యార్థులకు విగ్రహాల పంపిణీ

వెయ్యి ప్రతిమల పంపిణీ

భీమునిపట్నం: అయ్యప్ప సేవా సంఘం ఆధ్వర్యంలో మెయిన్ రోడ్డులో వెయ్యి మట్టి వినాయక ప్రతిమలను పంపిణీ చేశారు. సేవా సంఘం అధ్యక్షుడు కొమ్మినేని ఎర్రునాయుడు, ఉపాధ్యక్షుడు కదిరి జగన్నాథం, ప్రధాన కార్యదర్శి మొకర నర్శింగరావు, కోశాధికారి పిల్లి శ్రీను సభ్యులు పాల్గొన్నారు.

- న్యాయవాదుల సంఘం ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి నాగేశ్వరరావు కోర్టు సిబ్బందికి, న్యాయవాదులకు, కక్షిదారులకు, గుమస్తాలకు అందించారు. న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు ఎం.వి.పార్వతీశం, కోశాధికారి ముమ్మిడిశెట్టి సునీల్, న్యాయవాదులు పోలిశెట్టి వెంకటేష్, బాల భాస్కర్ పాల్గొన్నారు.
- ప్రభుత్వ డిగ్రీ కళాశాల వద్ద ప్రిన్సిపాల్ సీహెచ్. విష్ణుమూర్తి ఆధ్వర్యంలో మట్టి వినాయక ప్రతిమల పంపిణీ జరిగింది, అధ్యాపకులు ఎస్.శ్రీను, అప్పలనాయుడు, ప్రవీణ, ప్రసాదరావు పాల్గొన్నారు.

శిల్పారామంలో..

పీఎం పాలెం: ఏపీ వర్కింగ్ జర్నలిస్ట్ యూనియన్ ఆధ్వర్యంలో శిల్పారామంలో శుక్రవారం మట్టి వినాయక ప్రతిమలను పంపిణీ చేశారు. పీఎం పాలెం ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ సీఐ కాంతారావు పాత్రికేయులకు వీటిని అందించారు. బాబా ఇంజినీరింగ్ కాలేజీ కరస్పాండెంట్ కె. శ్రీలక్ష్మి కళాశాలలో మట్టి వినాయక ప్రతిమలను సిబ్బందికి, విద్యార్థులకు అందజేశారు.

అంతటా చవితి సందడి

బొజ్జ గణపయ్య పండగ సందడి భీమిలి నియోజకవర్గమంతటా నెలకొంది. విఘ్ననాయకుడిని అర్చించేందుకు పూజా సామగ్రిని తీసుకువెళ్లే వారితో మార్కెట్లన్నీ శోభాయమానంగా దర్శనమిచ్చాయి. మరోవైపు ప్రకృతిహితంగా పండగ చేసుకోవాలన్న ప్రజల అభీష్టం మేరకు మట్టి గణపతి ప్రతిమలు వేలాదిగా సిద్ధమయ్యాయి. పర్యావరణ ప్రేమికులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు వాటిని పంపిణీ చేస్తున్నారు. ఇక మండపాల్లో కొలువుదీరేందుకు భారీ గణనాథులు కూడా ప్రయాణమార్గంలో ఉన్నారు. ఇలా.. ఎటు చూసినా చవితి సందడే కానవస్తోంది.



తగరపువలస మెయిన్‌రోడ్డులో రద్దీ

- పూజాసామగ్రి కొనుగోలుదారులతో మార్కెట్లలో రద్దీ

తగరపువలస: వినాయకచవితి సందర్భంగా శుక్రవారం తగరపువలస, ఆనందపురం మార్కెట్లు వినియోగదారులతో రద్దీగా మారిపోయాయి. చిరువ్యాపారులతో రహదారులు సందడిగా కనిపించాయి. పూజలకు అవసరమైన కొబ్బరికాయలు, అరటిపండ్లు, పండ్లు, కాయలు, పువ్వులు, అలంకరణ సామాగ్రి, వినాయక ప్రతిమలు, పత్రి రోడ్లపై రాశులుగా పోసి విక్రయించారు. రద్దీ కారణంగా ప్రధాన రహదారి స్తంభించిపోయింది. వినాయక విగ్రహాల తయారీ కేంద్రాల నుంచి ఉత్సవ కమిటీ నిర్వాహకులు విగ్రహాలను దగ్గరలోని మండపాలకు తరలించారు. వస్త్ర, స్వీట్ల దుకాణాల్లోనూ పండగ శోభ కనిపించింది, శనివారం చవితి సెలవు కావడంతో వివిధ విద్యాసంస్థల నుంచి విద్యార్థులు ఇళ్లకు తరలివెళ్లారు. దీంతో ప్రయాణ సాధనాలు కూడా కిక్కిరిసిపోయాయి. ఆలయాలు, వీధుల్లో ఏర్పాటు చేస్తున్న మండపాలను నిర్వాహకులు విద్యుద్దీపాలతో అలంకరిస్తున్నారు.



ఆనందపురం పువ్వుల మార్కెట్‌లో కొనుగోలుదారుల సందడి

అందుబాటులో పువ్వుల ధరలు : ఆనందపురం మార్కెట్‌లో పువ్వుల ధరలు దిగివచ్చాయి. శ్రావణ మాసం సందర్భంగా ఆకాశాన్నంటిన పూలధరలు ఇప్పుడు వినియోగదారులకు అందుబాటులోకి వచ్చాయి. కిలో చామంతులు రూ.400, బంతి రూ.300, హైబ్రిడ్ గులాబీ రూ.3 వంతున పూల వ్యాపారులు విక్రయించారు. దేశవాళీ గులాబీలు వినియోగదారులకు అందుబాటు లో లేవు. చెరువుల నుంచి సేకరించిన కమలాలను ఒక్కొక్కటి రూ.30 నుంచి రూ.50 వరకు విక్రయించారు.

కిక్కిరిసిన రహదారులు



వేములవలస ఫ్లై ఓవర్ వద్ద వాహనాల రద్దీ

- హైవే పై రెండు కి.మీ. మేర నిలిచిపోయిన వందలాది వాహనాలు
- భీమిలి క్రాస్‌రోడ్డు నుంచి వేముల వలస జంక్షన్ వరకు ట్రాఫిక్ జామ్

తగరపువలస: వినాయక చవితి సందర్భంగా శుక్రవారం నగరం నుంచి వివిధ ప్రాంతాలకు వెళ్లే రహదారులు కిక్కిరిసిపోయాయి. దీంతో ఆనందపురం మండలం బోయిపాలెం కూడలి తరువాత భీమిలి క్రాస్‌రోడ్డు నుంచి వేములవలస కూడలి వరకు జాతీయరహదారిపై వందలాది వాహనాలు నిలిచిపోయాయి. సాధారణ రోజుల్లోనే వేములవలస మార్కెట్ వద్ద ట్రాఫిక్ ఎక్కువ. ఈ కూడలి విశాఖ, విజయనగరం, అనకాపల్లి జిల్లాలకు వెళ్లే కేంద్రంగా ఉండటంతో ఇక్కడ ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు నిత్యం పోలీస్ సిబ్బంది అవసరం ఉంటుంది.



భీమిలి క్రాస్‌రోడ్డు నుంచి ఆనందపురం వైపు నిలిచిపోయిన వాహనాలు

కానీ ఆనందపురం పరిధిలో సరిపడినంత సిబ్బంది లేకపోవడంతో వేములవలస కూడలి నిత్యం పద్మవ్యూహాన్ని తలపిస్తుంది. ఇలాంటి పండగ రోజుల్లో అయినా ట్రాఫిక్ సిబ్బందిని పెంచి రద్దీగా ఉండే ముఖ్యమైన కూడళ్లలో ఉంచాలని వాహనదారులు కోరుతున్నారు. వందలాది వాహనాలు సుమారు రెండు కిలోమీటర్ల మేర నిలిచిపోవడంతో ప్రయాణికులు ఇబ్బంది పడ్డారు.

చిట్టి చేతుల్లో మట్టి గణపయ్య



తాము చేసిన మట్టి విగ్రహాలతో బంగ్లామెట్ట పాఠశాల విద్యార్థులు



మట్టి గణపతి విగ్రహాలు తయారు చేస్తున్న చిప్పాడ హైస్కూల్ విద్యార్థులు

తగరపువలస: చిట్టి చేతుల్లో మట్టి గణపయ్య రూపుదిద్దుకున్నారు. జీవీఎంసీ ఒకటో వార్డు బంగ్లామెట్ట ప్రాథమిక పాఠశాల విద్యార్థులు శుక్రవారం మట్టి గణపతి విగ్రహాలను తయారు చేసి ప్రదర్శించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు రెడ్డిపల్లి అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

- భీమిలి మండలం చిప్పాడ జెడ్పీ హైస్కూల్లో విద్యార్థులు మట్టి గణపతి విగ్రహాలు తయారు చేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయిని ఎం.వి.టి.రత్నం, ఉపాధ్యాయుడు రేఖ అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

వరద బాధితులకు రూ.లక్ష విరాళం



ఎమ్మెల్యే గంటాకు చెక్కు అందజేస్తున్న రామరాజు

పద్మనాభం: విజయవాడ వరద బాధితుల కోసం సీఎం రిలీఫ్ ఫండ్‌కు పాండ్రంగికి చెందిన ఎస్ఆర్‌కే కన్‌స్ట్రక్షన్స్ యజమాని కె.రామరాజు రూ.లక్ష విరాళం అందించారు. ఈ మొత్తాన్ని చెక్కు రూపంలో ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావుకు అందజేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ డి.గోపాలకృష్ణ మూర్తిరాజు, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు కె.దామోదరరావు పాల్గొన్నారు.

స్వతంత్రనగర్ పార్కులో సదుపాయాలు కల్పిస్తాం

- ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు

మధురవాడ: స్వతంత్రనగర్ పార్కులో అన్ని రకాల సదుపాయాలు కల్పిస్తామని ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు తెలిపారు. జీవీఎంసీ 7వ వార్డు పరిధి స్వతంత్రనగర్‌లో 5.5 ఎకరాల్లో ఉన్న పెద్ద పార్కును శుక్రవారం ఆయన సందర్శించారు. పార్కు నిర్వహణ సరిగ్గా లేకపోవడం, టాయిలెట్స్‌కు తాళాలు వేసి ఉండడం, లాన్‌లో పిచ్చి మొక్కలు పెరిగి ఉండడాన్ని గమనించారు. టాయిలెట్స్ తాళాలు వేసి ఉంటే ఎలా అని అధికారులను ప్రశ్నించారు. పార్కు ఎక్కువ మందికి ఉపయోగపడేలా తక్షణ చర్యలు తీసుకుంటామన్నారు. ఆధునికీకరణ పనులు, లైటింగ్ ఏర్పాటు, మంచినీటి సౌకర్యం, సెక్యూరిటీ ఏర్పాటు చర్యలు చేపడతామన్నారు. ఇక్కడ ఆక్రమణకు గురైన పార్కు స్థలాన్ని పరిశీలించారు. పార్కులో జిమ్ సామగ్రి ప్రస్తుతం ఉన్నదాని కంటే మరొకటి ఏర్పాటు చేయాలని స్థానికులు కోరారు. మొదట మధురవాడ మిథిలాపురి ఉడా కాలనీలో మట్టి వినాయక ప్రతిమలను పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబుతో కలిసి ఆయన పంపిణీ చేశారు. కార్యక్రమాల్లో పలువురు టీడీపీ, జనసేన నాయకులు పాల్గొన్నారు.



స్వతంత్రనగర్ పార్కులో పచ్చికలో పెరిగిన పిచ్చి మొక్కలు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాసరావు

విద్యార్థుల మనోవికాసానికి క్రీడలు తప్పనిసరి

- ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు సమయం కేటాయించాలి
- రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ సభ్యుడు గొండు సీతారాం

తగరపువలస: విద్యార్థుల మనోవికాసానికి క్రీడలు తప్పనిసరని రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ సభ్యుడు జి.సీతారాం అన్నారు. భీమిలి కేథరిన్ విద్యాసంస్థల సమావేశ మందిరంలో మూడు మండలాల ప్రైవేట్ విద్యాసంస్థల యాజమాన్యాలు, ప్రిన్సిపాళ్ల సమావేశంలో శుక్రవారం ఆయన మాట్లాడారు. విద్యార్థులు ఒత్తిడిని తట్టుకునేందుకు పాఠశాలల యాజమాన్యాలు క్రీడలకు కొంత సమయం కేటాయించాలని సూచించారు. దీనిపై తమ కమిషన్ రాష్ట్ర ప్రభుత్వానికి సిఫారసులు చేయనుందని చెప్పారు. బాలలపై లైంగికదాడుల నిర్మూలన, మంచి-చెడు స్పర్శలపై అవగాహన, బాలికలలో రుతుసమయంలో ఒత్తిడి కలగకుండా ఆరోగ్యసూత్రాలు, బాలల హక్కులు, చట్టాలపై ప్రత్యేక దృష్టి సారించనున్నామన్నారు. ఫీజులు చెల్లించలేదని విద్యార్థులను నలుగురిలో నిలబెట్టడం, ఆరుబయట ప్రత్యేక శిక్షలు వంటి అంశాలపై కమిషన్ దృష్టి సారిస్తుందన్నారు. ఇలాంటి సంఘటనలను సుమోటాగా స్వీకరించి చట్టపరమైన చర్యలకు కలెక్టర్లు, డీఈవోలకు ఆదేశాలు ఇస్తామన్నారు. గ్రీన్ ఎంబసీ ఫౌండర్ ఉమారాజ్, సైకాలజిస్ట్ ఎం.వంశీ మాట్లాడారు. కార్యక్రమంలో గర్ల్ చైల్డ్ డెవలప్‌మెంట్ అధికారి డాక్టర్ ఖలీషా బేగం, ఎంపీవోలు శివరాణి, రమణ, ఐసీడీఎస్ భీమిలి పీవో ఎం.శ్రీదేవి, అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ ప్రసాద్, కేథరిన్ ప్రిన్సిపాల్ సౌజన్య సాయి, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు ఉమాజానకి, రేఖావాణి, లీగల్ కం ప్రొబేషన్ అధికారి అనీజ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బాలల హక్కుల కమిషన్ సభ్యుడు సీతారాం

44 మంది డ్రైవింగ్ లైసెన్సుల రద్దు

పీఎం పాలెం: ట్రాఫిక్ నిబంధనలు అతిక్రమించిన వారిపై పోలీసులు ఉక్కుపాదం మోపారు. పీఎం పాలెం ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో నిర్వహించిన డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలలో మద్యం సేవించి ద్విచక్ర వాహనం నడుపుతున్న 8 మందిపై కేసులు నమోదు చేశామని స్థానిక ఆర్ఎస్ఐ విజయ్ కుమార్ తెలిపారు. వారిని కోర్టు ముందు హాజరు పరచగా న్యాయమూర్తి ఒక్కొక్కరికీ రూ. 5వేలు నుంచి 7వేల రపాయలు వంతున మొత్తం 40 వేల రూపాయలు జరిమానా విధించారని స్థానిక ఆర్ఎస్ఐ విజయ్‌కుమార్ తెలిపారు. హెల్మెట్ ధరించకుండా ద్విచక్రవాహనంపై వెళుతున్న 44 మందిపై కేసులు నమోదు చేసి మూడు నెలల పాటు వారి డ్రైవింగ్ లైసెన్స్ రద్దు చేశామన్నారు.



తనిఖీలు నిర్వహిస్తున్న పీఎం పాలెం ట్రాఫిక్ పోలీసులు

వరద బాధితుల కోసం విరాళాల సేకరణ

మధురవాడ: విజయవాడ వరదల్లో చిక్కుకున్న ప్రజానీకానికి చేయూతనిచ్చేందుకు అందరూ ముందుకు రావాలని సీపీఐ జిల్లా కార్యదర్శి మరుపిళ్ల పైడిరాజు కోరారు. సీపీఐ ఆధ్వర్యంలో మధురవాడలో శుక్రవారం విరాళాలు సేకరించారు. దుకాణాల యజమానులు, చిరు వ్యాపారుల వద్ద విరాళాలు స్వీకరించారు. ఆయన మాట్లాడుతూ తమ పార్టీ ద్వారా ఇప్పటికే లక్ష రూపాయలు సేకరించి బాధితులకు పంపించినట్టు చెప్పారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు వి. సత్యనారాయణ, ఎండీ బేగం, బంగారయ్య, త్రినాథ్ తదితరులు పాల్గొన్నారు.



విరాళాలు సేకరిస్తున్న పైడిరాజు

ప్రైవేటు స్థలంలోనూ ఆక్రమణలే..!



ప్రైవేటు స్థలంలో ఏర్పాటు చేసిన బడ్డీ

కొమ్మాది: ఖాళీ స్థలం కనబడితే చాలు కబ్జా చేసేస్తున్నారు ఆక్రమణదారులు. ఇప్పటి వరకు ప్రభుత్వ స్థలాలను మాత్రమే ఆక్రమించడమో, నిర్మాణాలు చేపట్టడమో జరిగేది. ఇప్పుడిక ప్రైవేట్ స్థలాలపైనా ఆక్రమణదారుల కన్ను పడటంతో స్థల యజమానులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. అధికారపార్టీ అండదండలతో జరుగుతున్న ఆగడాలకు ఈ ఆక్రమణే నిదర్శనం.. చిన్న రుషికొండ జంక్షన్ వద్ద ఓ టీడీపీ నేత ఓ ప్రైవేటు స్థలాన్ని ఆక్రమించి దర్జాగా బడ్డీ ఏర్పాటు చేశాడు. దీనిపై స్థలం యజమాని ఎం.లలితారాణి తమ స్థలాన్ని ఆక్రమించుకున్న వ్యక్తిని ప్రశ్నించగా అధికార పార్టీ నాయకులకే ఎదురు చెప్తారా అంటూ హెచ్చరించినట్లు తెలిపారు. ఈ నేపథ్యంలో ఆమె పోలీస్‌స్టేషన్‌లో, రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు. అధికార నాయకుల బారి నుండి తమ స్థలాన్ని రక్షించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

లే అవుట్‌లో రోడ్డు ధ్వంసం



తవ్వేయడంతో ధ్వంసమైన రోడ్డు

భీమునిపట్నం: ప్రైవేట్ లే అవుట్‌లో జీవీఎంసీ వేసిన తారు రోడ్డు ధ్వంసమైంది. ఇక్కడ బీచ్‌రోడ్డు సమీపంలో ఎస్ఓఎస్ చిల్డ్రన్స్ విలేజ్ దగ్గరలోని ఓ ప్రైవేట్ లే అవుట్‌లో జీవీఎంసీ వేసిన తారు రోడ్డును కొందరు గుర్తు తెలియని వ్యక్తులు తవ్వి ధ్వంసం చేశారు. విషయం తెలుసుకున్న పబ్లిక్ వర్క్స్ ఏఈ సుమన్ మాట్లాడుతూ బాధ్యులను గుర్తించి చర్యలు తీసుకుంటామన్నారు. ఇక్కడ కొందరి స్థలాలకు సంబంధించిన గోడలను కూడా కూల్చివేయగా, వారు పోలీసులకు ఫిర్యాదు చేశారు.